10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/26/2026 4:08 AM Page 1

మన రాజధాని

# రక్షణ

నిజం మా బలం

బాపట్ల | గుంటూరు | పల్నాడు

బుధవారం 26 ఆగస్టు 2026 పేజీలు : 4

# కోనా..మాటలొద్దు..!

## దేవాలయాలు కూల్చడం మీ సాంస్కృతి...

- ఎక్కడైనా సొంత నిధులతో పునర్నిర్మాణం చేపట్టావా....
- పునర్నిర్మాణానికి సొంత నిధులతో రూ.70 లక్షల హామీ అంటు ప్రకటన...
- సీఎం సహాయనిధితో పేదలకు అండ.. బాపట్లకు రెండేళ్లలో రూ.10 కోట్లకు పైగా
- ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ...



దేవాలయాల అభివృద్ధిపై మాజీ ఉపసభాపతి కోన రఘుపతి చేస్తున్న విమర్శలకు బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రాజు గట్టి కౌంటర్ ఇచ్చారు. “మీరు దేవాలయాలను కూల్చితే.. మేము వాటి పునర్నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నాం” అంటూ కోనను నేరుగా టార్గెట్ చేశారు. అభివృద్ధి పేరుతో మాటలు చెప్పడం తప్ప సొంత నిధులతో ప్రజల కోసం ఏ రోజైనా ఖర్చు చేసిన దాఖలాలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. మరోవైపు పేదల వైద్యానికి సీఎం చంద్రబాబు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని ప్రస్తావిస్తూ.. బాపట్ల నియోజకవర్గానికి రెండేళ్లలోనే సీఎం సహాయనిధి కింద రూ.10 కోట్లకు పైగా మంజూరు కావడం చరిత్ర అని పేర్కొన్నారు.

వివరాలు 2లో..

# ఎమ్మెల్యేనా మజాకా...!



## యార్డులో ఎమ్మెల్యే ‘దందా’పై దుమారం

- లైసెన్సుల చుట్టూ రాజకీయ పెత్తనం..
- బెదిరించి లొంగదీసుకున్నారనే ఆరోపణలు....
- భారీ మొత్తంలో చేతులు మారాయని ఆరోపణ....
- క్యాడర్లోనే తీవ్ర అసంతృప్తి...

గుంటూరు మిర్చి యార్డు అంటే రైతుల చెమటతో నడిచే మార్కెట్.. కానీ ఓ ఎమ్మెల్యేకు మాత్రం అది రాజకీయ పెత్తనానికి అడ్డాగా మారిందా? లైసెన్సుల వ్యవహారంలో జోక్యం.. ప్రత్యర్థి వర్గంపై ఒత్తిళ్లు.. లొంగదీసుకున్నారని ఆరోపణలు.. ఆపై అదే వర్గానికి తిరిగి లైసెన్సులు రావడం వెనుక అసలు కథేంటి? భారీ మొత్తంలో చేతులు మారాయన్న ప్రచారానికి ఆధారాలున్నాయా? ప్రజాసేవ ముసుగులో యార్డు వ్యవహారాలను శాసించాలనుకోవడంపై సొంత పార్టీ నేతలే ప్రశ్నలు సంధిస్తున్న పరిస్థితి.

గుంటూరు: రక్షణ బ్యూరో...

వివరాలు 2లో..

# గుంటూరు పోలీస్‌లో ‘మనోళ్లు.. వాళ్లోళ్లు’!



వివరాలు 2లో..

- నాలుగేళ్లుగా కదలని ఎస్సైలు.. బదిలీలకు బ్రేకులెందుకు?
- సిఫార్సులకే సలాం.. బీసీ, ఎస్సీలకు మాత్రం సైడ్‌లైన్?

గుంటూరులో ఎస్సైల ‘తిష్ట’.. పోలీస్ శాఖలో వర్గపోరుకు బీజమా? గత నాలుగేళ్లుగా ఒకే చోట ఎస్సైలు ఎందుకు పాతుకుపోయారన్న ప్రశ్నకు సమాధానం లేక పోలీసు ఉన్నతాధికారులు విమర్శలు ఎదుర్కొంటున్నారు. కమ్మ, కాపులకే కీలక పోస్టింగుల్లో ప్రాధాన్యమా? బీసీ, ఎస్సీలు సీ క్యాడర్‌కే పరిమితం కావాల్సిందేనా? సిఫార్సులకే పెద్దపీటా? అన్న ఆరోపణలు పోలీస్ శాఖలో కలకలం రేపుతున్నాయి.

గుంటూరు: రక్షణ క్రైమ్ స్పెషల్..

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/26/2026 4:08 AM Page 2



# కూడో క్రీడలతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు



**బాపట్ల రక్షణ న్యూస్**

పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో జిల్లా స్థాయి రెండో కూడో ఛాంపియన్‌షిప్ ఫైనల్ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాంధ్ర సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం విజేతలకు పతకాలు, ధ్రువపత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా తాంధ్ర సాంబశివరావు మాట్లాడుతూ క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. క్రమశిక్షణతో క్రీడలను అభ్యసించి జిల్లా, రాష్ట్ర, దేశానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. దేశవ్యాప్తంగా ఆదరణ పొందుతున్న కూడో క్రీడలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత ప్రోత్సహించాలని కోరారు.జాతీయస్థాయి కూడో పోటీల్లో బంగారు పతకాలు సాధించిన ఆంధ్రప్రదేశ్ కూడో సంఘం ఉపాధ్యక్షుడు అడే కిరణ్ కిషోర్, బాపట్ల జిల్లా కూడో సంఘం ప్రధాన కార్యదర్శి దివ్య తేజ్ బాపట్ల ప్రాంతానికి చెందిన వారు కావడం గర్వకారణమన్నారు. పోటీలను సమర్థవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు.కార్యక్రమంలో జిల్లా కూడో సంఘం అధ్యక్షుడు రామకోటి రెడ్డి, సంయుక్త కార్యదర్శి సామ్యూల్ రాజ్, బాపట్ల సంఘం అధ్యక్షుడు పుట్టా ఆదిశేషా రెడ్డి, సంయుక్త కార్యదర్శి పీటా సారధి, మాజీ సైనికులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే నా మజాకా...!

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు: రక్షణ బ్యూరో...**

మిర్చి యార్డు అంటే రైతులు, వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లకు సంబంధించిన వ్యవహారం. కానీ ఇప్పుడు అక్కడ రాజకీయ పెత్తనం, లైసెన్సుల వ్యవహారమే హాట్‌టాపిక్‌గా మారింది. అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే యార్డులో తన మాటే నడవాలన్నట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రత్యర్థి రాజకీయ వర్గంతో సంబంధాలున్న కొందరిని ఒత్తిడికి గురిచేసి లొంగదీసుకున్నారని, ఆ తర్వాత మళ్లీ అదే వర్గానికి చెందిన వారికి లైసెన్సులు దక్కడం వెనుక అసలు కథ ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.మిర్చి యార్డులో కొందరు లైసెన్సులు ఒకరి పేరుతో ఉండగా.. వ్యాపార వ్యవహారాలు మాత్రం మరొకరి చేతుల్లో నడుస్తున్నాయనే ఆరోపణలు చాలాకాలంగా వినిపిస్తున్నాయి. లైసెన్సుదారులు కేవలం పేరుకే పరిమితమై.. తెరవెనుక వేరే వ్యక్తులు వ్యాపారాలను నడిపిస్తున్నారనే విమర్శలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరిస్తున్నారో తేల్చాల్సిన అధికారులు ఉన్నప్పటికీ.. రాజకీయ జోక్యంతో అసలు సమస్య పక్కదారి పడుతోందనే చర్చ సాగుతోంది.ఇటీవల ఈ వ్యవహారంలో ఎమ్మెల్యే జోక్యం చేసుకున్నారనే ఆరోపణలు మరింత తీవ్రతరం అయ్యాయి. వైసీపీకి చెందిన ఓ ఎమ్మెల్సీ వర్గంతో సన్నిహితంగా ఉన్నారని ప్రచారంలో ఉన్న కొందరు యార్డు వ్యాపారులపై ఒత్తిడి తెచ్చి.. వారిని బెదిరించి లొంగదీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజకీయంగా తనకు వ్యతిరేకంగా ఉన్న వర్గం యార్డులో బలపడకూడదనే ఉద్దేశంతోనే ఈ వ్యవహారం నడిపించారనే విమర్శలు కూడా ఉన్నాయి. అయితే ఈ ఆరోపణలకు అధికారిక నిర్ధారణ లేదు.అసలు సంచలనం ఇక్కడే మొదలైందని యార్డు వర్గాలు చెబుతున్నాయి. ఒక దశలో లైసెన్సుల విషయంలో కఠినంగా వ్యవహరించినట్లు ప్రచారం జరగగా.. ఆ తర్వాత అదే వ్యక్తులకు తిరిగి లైసెన్సులు దక్కడం చర్చకు దారితీసింది. ముందుగా భయపెట్టి.. తర్వాత బుజ్జగించి.. చివరకు లైసెన్సులు తిరిగి ఇచ్చేంతగా పరిస్థితి ఎందుకు మారింది? మధ్యలో ఏం జరిగింది? ఎవరు రాజీ కుదిర్చారు? అన్నదే ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది.ఇదంతా ఉచితంగా జరిగిందా? లేక భారీ మొత్తంలో డబ్బు చేతులు మారాయా? అన్న ఆరోపణలు కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. లైసెన్సుల వ్యవహారంలో కోట్ల రూపాయల వ్యాపారం ముడిపడి ఉండటంతో ఈ అనుమానాలకు మరింత ప్రాధాన్యం లభిస్తోంది. అయితే డబ్బు లావాదేవీలకు సంబంధించి ప్రస్తుతం ఎలాంటి అధికారిక ఆధారాలు బయటకు రాలేదు. విచారణ జరిగితేనే ఈ ఆరోపణల్లో వాస్తవమెంతో తేలనుంది.మిర్చి యార్డులో ఎమ్మెల్యే జోక్యం ఎందుకంతగా? అనే ప్రశ్నకు కూడా స్పష్టమైన సమాధానం రావడం లేదు. రైతుల సమస్యలు, మార్కెట్ సదుపాయాలు, ధరల పరిస్థితి వంటి అంశాలపై దృష్టి పెట్టాల్సిన ప్రజాప్రతినిధి.. లైసెన్సులు, వ్యాపార వర్గాలు, యార్డు వ్యవహారాల్లో ఎందుకు అంత ఆసక్తి చూపుతున్నారనే ప్రశ్నలు సొంత పార్టీ నేతల నుంచే వస్తున్నట్లు సమాచారం.'కొత్తగా వచ్చి ఇంత పెత్తనం ఏంటి?' అంటూ కొందరు అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు అంతర్గతంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో ప్రతి వ్యవహారంలోనూ తన మాటే చివరి మాట అన్నట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఎమ్మెల్యే తీరుపై పార్టీ క్యాడర్‌లోనే చర్చ మొదలైందని సమాచారం.మరోవైపు ప్రజాసేవ కార్యక్రమాలకు మాత్రం సోషల్ మీడియాలో భారీ ప్రచారం కల్పించుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రజల కోసం పనిచేస్తున్నామంటూ వీడియోలు, ఫొటోలు పెట్టుకుంటూ ఒకవైపు ప్రచారం సాగుతుండగా.. మరోవైపు మిర్చి యార్డులో రాజకీయ పెత్తనం చేస్తున్నారనే ఆరోపణలు రావడం విరుద్ధ పరిస్థితిని చూపిస్తోందని ప్రత్యర్థులు విమర్శిస్తున్నారు.ఈ వ్యవహారం పార్టీ అధిష్ఠానం దృష్టికి వెళ్లిందనే ప్రచారం కూడా జరుగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కు ఎమ్మెల్యే వ్యవహారశైలిపై పలు ఫిర్యాదులు వెళ్లాయని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. యార్డులో ఎమ్మెల్యే జోక్యం ఎంతవరకు ఉంది? లైసెన్సుల వ్యవహారంలో ఎవరి పాత్ర ఉంది? అన్నదానిపై పార్టీ పెద్దలు ఆరా తీస్తున్నారనే సమాచారం వినిపిస్తోంది. అయితే అధికారికంగా ఎలాంటి చర్య ప్రకటించలేదు.మిర్చి యార్డు వ్యవహారం కేవలం ఒక మార్కెట్ వివాదంగా మిగిలిపోతుందా? లేక అధికార పార్టీ ఎమ్మెల్యే రాజకీయ భవిష్యత్తుపైనే ప్రభావం చూపే స్థాయికి చేరుతుందా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది. పార్టీకి చెడ్డపేరు రాకముందే అధిష్ఠానం జోక్యం చేసుకుంటుందా? ఎమ్మెల్యేకు గట్టిగా క్లాస్ ఇస్తుందా? లేక ఆరోపణలను పక్కనపెట్టి వ్యవహారం సద్దుమణిగేలా చూస్తుందా? అన్నది ఆసక్తిగా మారింది.మిర్చి యార్డులో లైసెన్సుల నుంచి మొదలైన ఈ వ్యవహారం.. చివరకు ఎమ్మెల్యే రాజకీయ పెత్తనం, పార్టీ అంతర్గత అసంతృప్తి, అధిష్ఠానం జోక్యం వరకు వెళ్లడం గుంటూరు రాజకీయాల్లో ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. అసలు లైసెన్సుల కథ వెనుక ఎవరి 'చేయి' ఉందన్నది తేలాల్సి ఉంది.

# గుంటూరు పోలీస్‌లో 'మనోళ్లు.. వాళ్లోళ్లు'!

**గుంటూరు: రక్షణ క్రైమ్ స్పెషల్..**

పోలీస్ శాఖలో బదిలీ అంటే నిబంధనల ప్రకారం జరగాల్సిన పరిపాలనా ప్రక్రియ. కానీ గుంటూరు నగరంలో కొందరు ఎస్సైల విషయంలో మాత్రం ఆ నిబంధనల పుస్తకం మూసేశారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నాలుగేళ్లుగా ఒకేచోట పాతుకుపోయిన ఎస్సైలు ఇంకా అక్కడే ఎలా కొనసాగుతున్నారు? వారిని కదిలించేందుకు ఏ నిబంధన అడ్డొస్తోంది? లేక ఎవరి సిఫార్సు వారికి రక్షణ కవచంగా మారింది? అనే ప్రశ్నలు పోలీస్ వర్గాల్లోనే తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.సాధారణంగా ఒక అధికారి ఒకే ప్రాంతంలో ఎక్కువకాలం పనిచేస్తే స్థానిక పరిచయాలు, సంబంధాలు, ప్రభావాలు పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే బదిలీలకు ప్రాధాన్యం ఇస్తారు. కానీ గుంటూరులో మాత్రం 'నిబంధనలు అందరికీ.. మినహాయింపులు కొందరికేనా?' అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాలుగేళ్లుగా కొనసాగుతున్న వారి విషయంలో బదిలీ ప్రక్రియ ఎందుకు నత్తనడకన సాగుతోంది? ఫైళ్లు కదలడం లేదా? లేక కదిలినా ఆగిపోతున్నాయా? అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపైనే ఉంది.

**పోస్టింగుల్లో 'మనోళ్లు.. వాళ్లోళ్లు' ముద్ర?..**ఇక అసలు వివాదం ఇక్కడే మొదలవుతోంది. నగర పోలీస్ వ్యవస్థలో కీలక స్థానాల కేటాయింపుపై సామాజిక సమతుల్యతకు సంబంధించిన ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఒక వర్గానికి చెందిన అధికారులకు కీలక పోస్టింగులు.. మరికొందరికి ప్రాధాన్యం లేని స్థానాలేనా? అనే చర్చ పోలీస్ శాఖలోనే సాగుతోంది. బీసీ, ఎస్సీ వర్గాలకు చెందిన అధికారులకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.ఇవి ఆరోపణలేనని కొట్టిపారేయడం సులభమే. కానీ ఆ ఆరోపణలకు తావిస్తున్న పరిస్థితులపై సమీక్ష చేయడం మాత్రం ఉన్నతాధికారుల బాధ్యత. పోలీస్ శాఖలోనే 'మనవాళ్లు--వాళ్లోళ్లు' అనే భావన పాతుకుపోతే.. అది కేవలం పోస్టింగుల సమస్య కాదు. వ్యవస్థ విశ్వసనీయతకు వచ్చిన ముప్పు.

**ప్రభుత్వం ఒకటి చెబుతోంది.. క్షేత్రస్థాయిలో మరో చిత్రం?**

బీసీలకు పెద్దపీట వేస్తున్నామని, 33 శాతం రిజర్వేషన్లకు ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతున్న వేళ.. కీలకమైన పోలీస్ శాఖలోనే సామాజిక ప్రాతినిధ్యంపై ప్రశ్నలు రావడం ప్రభుత్వానికి ఇబ్బందికర పరిణామం. సంఖ్యల్లో సామాజిక న్యాయం కనిపించడం కాదు.. పోస్టింగుల్లోనూ, బాధ్యతల్లోనూ, నిర్ణయాధికారంలోనూ అది కనిపించాలి.బీసీలు, ఎస్సీలు కేవలం 'క్యాడర్' వరకే పరిమితం కావాలా? కీలకమైన స్థానాల్లో వారికి అవకాశం ఎప్పుడు? అన్న ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

**సిఫార్సులే ప్రమాణమైతే.. నిబంధనలు ఎందుకు?...**ఇంకోవైపు సిఫార్సులు, పరిచయాలు, ప్రభావాలు పోస్టింగులపై పనిచేస్తున్నాయన్న ఆరోపణలు మరింత అనుమానాలకు తావిస్తున్నాయి. నిజంగా అలాంటిదేమీ లేకపోతే నాలుగేళ్లుగా ఒకేచోట కొనసాగుతున్న అధికారులపై స్పష్టత ఇవ్వడంలో ఇబ్బంది ఏమిటన్న ప్రశ్న సహజంగానే వస్తోంది.ఎవరు సిఫార్సు చేశారు? ఎందుకు కొనసాగిస్తున్నారు? బదిలీ నిబంధనలు వారికి ఎందుకు వర్తించడంలేదు? అన్న అంశాలపై పారదర్శకంగా సమీక్ష జరిగితేనే ఈ అనుమానాలకు తెరపడుతుంది.లేకపోతే రేపు పోలీస్ శాఖలో పరిస్థితి 'మనవాడైతే ఒక రూల్.. మనవాడు కాకపోతే మరో రూల్' అన్న స్థాయికి చేరుకునే ప్రమాదం ఉంది. అది పోలీస్ వ్యవస్థకు అత్యంత ప్రమాదకరం.

**ఇప్పటికైనా ప్రక్షాళన చేయాల్సిందే!...**గుంటూరు నగరంలోని ఎస్సైలు, సీఐల పోస్టింగులపై సమగ్ర సమీక్ష చేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా సుదీర్ఘకాలంగా ఒకేచోట పనిచేస్తున్న అధికారులపై నిష్పక్షపాతంగా పరిశీలన జరపాలి. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి ఉంటే బదిలీ చేయాలి.. నిబంధనల ప్రకారమే కొనసాగుతున్నారంటే ఆ కారణాన్ని స్పష్టం చేయాలి.ఎందుకంటే అనుమానాలను పెంచేది బదిలీ కాదు.. బదిలీ ఎందుకు జరగడం లేదన్న మౌనం.ఇప్పటికైనా ప్రభుత్వం, పోలీస్ ఉన్నతాధికారులు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోకపోతే పోలీస్ శాఖలోనే వర్గాలుగా విడిపోయే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది. అది క్రమశిక్షణకు దెబ్బతీస్తుంది.. అధికారుల మధ్య నమ్మకాన్ని దెబ్బతీస్తుంది.. చివరికి ప్రభుత్వానికే తలనొప్పిగా మారుతుంది.గుంటూరు పోలీస్‌లో ఇప్పుడు కావాల్సింది 'ఎవరి మనిషి?' అనే లెక్క కాదు.. 'ఎవరు నిబంధనల ప్రకారం పనిచేస్తున్నారు?' అనే ఒక్కటే లెక్క.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/26/2026 4:08 AM Page 3




# కోనా... మాటలొద్దు..!

మొదటి పేజీ తరువాయి

బాపట్ల రక్షణ బ్యూరో...

బాపట్లలో దేవాలయాల అంశంపై రాజకీయ దుమారం కొనసాగుతున్న వేళ ఎమ్మెల్యే నరేంద్రవర్మ రాజు చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి అభివృద్ధి గురించి మాట్లాడుతున్నారని, కానీ ప్రజల కోసం వాస్తవంగా ఎవరు పనిచేస్తున్నారో ప్రజలే గమనిస్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. దేవాలయాల నిర్మాణం అంటే కేవలం ఇటుకలు పేర్చడం కాదని, వాటికి ప్రత్యేకమైన నిర్మాణ శైలి, సంప్రదాయం, శాస్త్రీయ విధానం ఉంటుందని స్పష్టం చేశారు.బాపట్ల శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయాల పునర్నిర్మాణానికి తన సొంత నిధుల నుంచి రూ.70 లక్షలు అందిస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ నిర్మాణాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కూడా చర్చించినట్లు తెలిపారు. దేవాలయాల పునర్నిర్మాణానికి సీఎం సానుకూలంగా స్పందించడమే కాకుండా రూ.కోటి వరకు విరాళం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారని చెప్పారు. దేవదాయ శాఖ నుంచి ఇప్పటికే రూ.1.10 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ప్రభుత్వ నిధులు, విరాళాలు, తన సొంత నిధులతో ఆలయాలను అద్భుతంగా పునర్నిర్మిస్తామని వెల్లడించారు.ఇదే సమయంలో కోన రఘుపతిపై ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విమర్శలు చేయడం, రాజకీయంగా మాటలు చెప్పడం సులభమేనని.. కానీ ప్రజల కోసం సొంతంగా ఎంత ఖర్చు చేశారో చెప్పాలని సవాల్ చేశారు. “అభివృద్ధి చేశామని చెప్పుకోవడం కాదు.. ప్రజలకు కనిపించేలా పనులు చేయాలి” అన్న రీతిలో ఆయన వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిందని, ఇంకా మూడేళ్ల సమయం ఉందని.. ఈ కాలంలో ఎవరు అభివృద్ధి చేశారో, ఎవరు ఏం చేశారో ప్రజలే తేలుస్తారని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజల మద్దతు ఎవరికి ఉంటుందో కూడా వారే నిర్ణయిస్తారని స్పష్టం చేశారు.ఇక రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా పేదల ఆరోగ్యంపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఎమ్మెల్యే ప్రస్తావించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. అనారోగ్యంతో ఆసుపత్రి ఖర్చులు భరించలేని కుటుంబాలకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందన్నారు. బాపట్ల నియోజకవర్గంలో ఇప్పటివరకు దాదాపు 1,500 మంది సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకోగా, 1,000 మందికి పైగా లబ్ధిదారులకు చెక్కులు అందినట్లు తెలిపారు. రెండేళ్ల వ్యవధిలో రూ.10 కోట్లకు పైగా నిధులు మంజూరు కావడం పేదల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.



తాజాగా బాపట్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 112 మంది లబ్ధిదారులకు రూ.71,92,793 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. బాపట్ల మండలానికి చెందిన 39 మందికి రూ.21,16,007, బాపట్ల పట్టణానికి చెందిన 22 మందికి రూ.12,53,240, పిట్టలవానిపాలెం మండలంలోని 24 మందికి రూ.20,49,234, కర్లపాలెం మండలంలోని 27 మందికి రూ.17,74,312 చొప్పున నిధులు మంజూరయ్యాయి.ఆపదలో ఉన్న పేదలకు సీఎం సహాయనిధి ఒక వరమని ఎమ్మెల్యే అన్నారు. వైద్యం కోసం అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని, మధ్యవర్తులకు తావులేకుండా లబ్ధిదారులకు నేరుగా ప్రయోజనం అందేలా చూస్తున్నామని చెప్పారు.బాపట్ల నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమంపై ప్రజల ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం మరోసారి అత్యధిక మెజారిటీతో గెలిచేలా ప్రజలే తీర్పు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. దేవాలయాల పునర్నిర్మాణం నుంచి పేదల వైద్యం వరకు.. మాటలకంటే చేతల్లోనే సమాధానం చెబుతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దీంతో కోన రఘుపతి విమర్శలకు నరేంద్రవర్మ ఇచ్చిన కౌంటర్ బాపట్ల జిల్లా రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

## ప్రతి గ్రామానికి 104 వైద్య సేవలు

గురజాల రక్షణ న్యూస్



గురజాల మండలంలోని ప్రతి గ్రామానికి 104 వైద్య సేవలను మరింత సమర్థవం తంగా, మెరుగైన రీతిలో అందుబాటులోకి తీసుకురా వాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాల యంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ చుక్కా రత్నమోహన్‌ను కలిసి వినతిపత్రం సమర్పిం చారు.ముఖ్యంగా పేద, సామాన్య ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో 104 సేవలను ప్రతి గ్రామానికి సమర్థవంతంగా అందించాలని విజ్ఞప్తి చేశారు.లక్ష్మీనారాయణ వినతిపై జిల్లా వైద్యాధికారి డాక్టర్ చుక్కా రత్నమోహన్ స్పందిస్తూ, త్వరలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో కలిసి ఈ అంశంపై చర్చిస్తామని తెలిపారు. గురజాల మండల ప్రజలు ఎదుర్కొంటున్న వైద్యపరమైన ఇబ్బందులను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని జిల్లా వైద్యాధికారి పేర్కొన్నారు.

## అక్రమ గ్యాస్ సిలిండర్లపై కొరడా

మార్టూరు రక్షణ న్యూస్

వాణిజ్య సంస్థల్లో గృహ అవసరాల కోసం వినియోగించే వంటగ్యాస్ సిలిండర్లను అక్రమంగా ఉపయోగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఏ. జగన్మోహన్‌రావు హెచ్చరించారు. ఆయన ఆదేశాల మేరకు మంగళవారం మార్టూరు పట్టణంలో పౌర సరఫరాల శాఖ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు.పట్టణంలోని వివిధ హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీల్లో తనిఖీలు చేపట్టిన అధికారులు అక్రమంగా వినియోగిస్తున్న 40 గృహోపయోగ వంటగ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా గ్యాస్ సిలిండర్లను వినియోగించిన 20 వాణిజ్య సంస్థలపై కేసులు నమోదు చేశారు.వాణిజ్య అవసరాలకు తప్పనిసరిగా వాణిజ్య వంటగ్యాస్ సిలిండర్లనే వినియోగించాలని అధికారులు స్పష్టం చేశారు. హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, టీ దుకాణాలు తదితర వాణిజ్య సంస్థల్లో గృహోపయోగ వంటగ్యాస్ సిలిండర్లను వినియోగించడం చట్టవిరుద్ధమని తెలిపారు.
నిబంధనలను ఉల్లంఘిస్తూ గృహోపయోగ వంటగ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించే వారిపై ఇకపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఏ. జగన్మోహన్‌రావు హెచ్చరించారు. వాణిజ్య సంస్థల నిర్వాహకులు నిబంధనలను తప్పనిసరిగా




పాటించాలని సూచించారు.తనిఖీల్లో మార్టూరు పౌర సరఫరాల పరిశీలకుడు సురేష్, పర్చూరు పౌర సరఫరాల పరిశీలకుడు కిషోర్, చీరాల పౌర సరఫరాల ఉప తహసీల్దార్ ఓంకార్, చుండూరు పౌర సరఫరాల ఉప తహసీల్దార్ గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/26/2026 4:08 AM Page 4



# పంటల నమోదు తప్పనిసరి



ఏవో సుమంత్ కుమార్

**కర్లపాలెం రక్షణ న్యూస్**

కర్లపాలెం మండలం పేరలి గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి సుమంత్ కుమార్ మాట్లాడుతూ రైతులు సెప్టెంబర్ 15లోపు తప్పనిసరిగా పంటల నమోదు చేయించుకోవాలని సూచించారు. వరి సాగు చేసిన రైతులు ఈ నెల 31లోపు పంటల బీమా చేయించుకోవాలని తెలిపారు. రుణాలు పొందిన రైతులు సంబంధిత బ్యాంకుల్లో, రుణాలు తీసుకోని రైతులు గ్రామీణ సేవా కేంద్రాల్లో బీమా చేసుకోవచ్చన్నారు. బీమా పరిహారం పొందాలంటే పంటల నమోదు తప్పనిసరని, పంట వేసిన 30 రోజుల తర్వాతే నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. రైతులు రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని సూచించారు. రైతులకు ఉపయోగపడే వ్యవసాయ దరఖాస్తు ద్వారా పంటల నమోదు, మద్దతు ధరలు, వాతావరణ సమాచారం, భూసార వివరాలు, చీడపీడల హెచ్చరికలు, వ్యవసాయ సలహాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి భాగ్యలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు గ్లోరీ, రైతులు పాల్గొన్నారు.

# స్థానిక ప్రతినిధుల హక్కులపై పోరాటం

**గురజాల రక్షణ న్యూస్**



స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పదవులకు భంగం కలిగించే ప్రయత్నాలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ప్రతిఘటిస్తుందని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. బాధ్యతగల ప్రతిపక్షంగా ప్రజల తరఫున నిలబడి, కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. గత ప్రభుత్వాలు ఎన్నికైన సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఇతర స్థానిక సంస్థల ప్రతినిధులను వారి పదవీకాలం పూర్తయ్యే వరకు కొనసాగించాయని గుర్తుచేశారు. ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన స్థానిక ప్రజాప్రతినిధుల పదవులకు భంగం కలిగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎన్నికైన ప్రతినిధుల పదవులకు ఆటంకం కలిగిస్తే న్యాయపోరాటం చేస్తామని, అవసరమైతే రాజీనామాలు లేదా సెలవుపై వెళ్లే నిర్ణయాలు తీసుకుంటామని హెచ్చరించారు. 2029 జూన్ వరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికైన ప్రతినిధులే స్థానిక సంస్థల్లో కొనసాగుతారని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వానికి రెండున్నరేళ్లు మాత్రమే సమయం ఉందని, చివరి ఆరు నెలలు ఎన్నికల ప్రక్రియతోనే గడిచిపోతాయని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను, అమలు కాని హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి అప్రమత్తం చేస్తామని తెలిపారు. వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా ముందుకు సాగాలని కాసు మహేష్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# విద్యార్థులకు పోలీసుల భద్రతా సూచనలు

**చందోలు రక్షణ న్యూస్**

విద్యార్థులు ర్యాగింగ్, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు మహిళల భద్రత, గుడ్ టచ్--బ్యాడ్ టచ్ వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని చందోలు పోలీసులు సూచించారు. రెడ్డిపాలెంలోని విజేత పాఠశాలలో విద్యార్థులకు పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చందోలు ఎస్ఐ మాధవరావుతో పాటు బాపట్ల ఈగల్ బృందం పాల్గొని పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాధవరావు మాట్లాడుతూ.. ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమని, నేరానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు, బాలికలపై వేధింపులు లేదా ఇతర నేరాలు జరిగినప్పుడు భయపడకుండా శక్తి యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని విద్యార్థినులకు సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండి, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని సూచించారు. గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయకుండా జాగ్రత్త వహించాలని చెప్పారు. ఈగల్ బృందం సభ్యులు



'నో డ్రగ్స్--నో టెన్షన్' నినాదంతో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. డ్రగ్స్‌కు అలవాటు పడకుండా దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వినియోగం లేదా సరఫరాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 1972కు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు చట్టాలు, భద్రతా అంశాలపై అవగాహన పెంచుకోవాలని, సైబర్ నేరాలు, ర్యాగింగ్, డ్రగ్స్ వంటి సామాజిక సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయనిధి భరోసా

**వేమూరు రక్షణ న్యూస్**



అనారోగ్యంతో బాధపడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి భరోసాగా నిలుస్తోందని వేమూరు నియోజకవర్గ శాసన సభ్యులు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. వేమూరు నియోజకవర్గానికి చెందిన ఐదుగురు బాధితులకు మొత్తం రూ. 7,77,260 విలువైన వైద్య సహాయం మంజూరైంది. చుండూరు మండలం మోదుకూరు గ్రామానికి చెందిన ముళ్లపూడి గౌతమ్‌కు రూ. 2,51,305, కొల్లూరు మండలం తాడిగిరిపాడు గ్రామానికి చెందిన కనపర్తి మోహన్‌రావుకు రూ. 1,01,030, వేమూరు మండలం జంపని గ్రామానికి చెందిన కొల్లిపర వెంకటేశ్వరరావుకు రూ. 1,22,941, అమృతలూరు మండలం ప్యాపర్రు గ్రామానికి చెందిన లిగినేని మోహన్‌రావుకు రూ. 2,51,460, చుండూరు గ్రామానికి చెందిన కోట సూర్యవతికి రూ. 50,524 చొప్పున వైద్య సహాయం మంజూరైంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల వైద్య ఖర్చులకు సంబంధించిన పత్రాలను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సిఫారసు లేఖ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కార్యాలయానికి పంపించారు. వాటిని పరిశీలించిన ప్రభుత్వం వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది. మంజూరైన సహాయానికి సంబంధించిన పత్రాలను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అత్యవసర వైద్య చికిత్స అవసరమైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసా కల్పిస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వేమూరు నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. వైద్య సహాయం అవసరమైన ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని నక్కా ఆనందబాబు తెలిపారు. తమకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

# రైతు సేవలే లక్ష్యంగా పనిచేయాలి

**సత్తెనపల్లి రక్షణ న్యూస్**

సత్తెనపల్లి రూరల్ మండలం ఫణిదం పీఏసీఎస్ చైర్మన్‌గా కోర్నె శ్రీనివాసరావు, సభ్యులుగా దేవరపల్లి సునీత, యర్రగుంట్ల వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సొసైటీ ప్రతినిధులు రైతుల సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సొసైటీలోని బకాయిలను త్వరితగతిన వసూలు చేసి, సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, పట్టణ, గ్రామ స్థాయిలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే చొరవతో రహదారి పనులు

**వేమూరు రక్షణ న్యూస్**

తెనాలి--చందోలు, అంగలకుదురు--నడిగడ్డపాలెం రహదారుల నిర్మాణ పనులు వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ప్రత్యేక చొరవ, నిరంతర కృషితోనే ముందుకు సాగుతున్నాయని ఆర్అండ్‌బీ అధికారులు స్పష్టం చేశారు. రహదారి పనులపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తూ మంగళవారం తెనాలి, గుంటూరు, బాపట్ల ప్రాంతాలకు చెందిన ఆర్అండ్‌బీ అధికారులు మీడియా సమావేశంలో వాస్తవాలను వెల్లడించారు.ప్రభుత్వం ఏర్పడిన అనంతరం పాత రహదారుల పరిస్థితిని పరిశీలిస్తున్న సమయంలో తెనాలి--చందోలు, అంగలకుదురు--నడిగడ్డపాలెం రహదారుల దుస్థితిని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అధికారుల దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రహదారి పనులను పూర్తి చేయాలని ఆయన పలుమార్లు అధికారులను కోరినట్లు వెల్లడించారు.ఈ రెండు రహదారుల్లో కొంత భాగం తెనాలి నియోజకవర్గంలో, మరికొంత భాగం వేమూరు నియోజకవర్గంలో ఉన్నాయని అధికారులు తెలిపారు. తెనాలి--చందోలు మార్గంలోని పెదరావూరు నుంచి సుమారు నాలుగు కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి రూ.2 కోట్లు, అంగలకుదురు--నడిగడ్డపాలెం మార్గంలోని సుమారు నాలుగు కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.2.50 కోట్ల చొప్పున ప్రతిపాదనలు ఉన్నాయని వివరించారు.

**కాంట్రాక్టర్లను ఒప్పించిన ఎమ్మెల్యే ఆనంద్ బాబు**

గత పదేళ్లుగా ఈ రెండు రహదారి పనులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. పాత ధరలకు పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో జాప్యం ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితుల్లో అధికారులు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబును సంప్రదించగా, ఆయన స్వయంగా కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు చేపట్టేలా చొరవ చూపారని స్పష్టం చేశారు.గత రెండేళ్లుగా రహదారుల సమస్యపై ఎమ్మెల్యే తమతో పలుమార్లు మాట్లాడారని, ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చే ఉద్దేశంతో పనులు పూర్తి



చేయాలని నిరంతరం అధికారులతో సమన్వయం చేశారని తెలిపారు. ఆయన చొరవతోనే కాంట్రాక్టర్లు ముందుకు వచ్చి పనులు ప్రారంభించారని అధికారులు పేర్కొన్నారు.

**ధర్నాల వల్ల పనులు ప్రారంభం కాలేదు**

రహదారి పనులు ప్రజల ధర్నాల వల్లే ప్రారంభమయ్యాయన్న ప్రచారం వాస్తవం కాదని ఆర్అండ్‌బీ అధికారులు స్పష్టం చేశారు. ఈ రెండు రహదారులు బాపట్ల జిల్లా పరిధిలో ఉన్నాయని, నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు ఇప్పటికే ఉన్నాయని తెలిపారు. సుమారు నెల రోజుల క్రితమే పనులు ప్రారంభమైనట్లు వెల్లడించారు. పనులు కొంత ఆలస్యమైనందుకు చింతిస్తున్నామని పేర్కొన్నారు.గతంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కొన్ని వ్యాఖ్యలు తప్పుగా అర్థమయ్యే విధంగా దొర్లాయని ఒక అధికారి వివరణ ఇచ్చారు. తాను ఎక్కడా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు-రహదారి పనుల్లో ప్రమేయం లేదని చెప్పలేదని, వాస్తవానికి ఆయన కృషి, చొరవతోనే పనులు ప్రారంభమయ్యాయని మరోసారి స్పష్టం చేశారు.రహదారి పనుల విషయంలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేయడమే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. పదేళ్ళుగా పెండింగ్‌లో ఉన్న రహదారి పనులు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చొరవతో కార్యరూపం దాల్చడం వాస్తవమని అధికారులు వెల్లడించారు.

## జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి




**కలెక్టర్ వినోద్ కుమార్**

**వేమూరు రక్షణ న్యూస్**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 31న వేమూరు నియోజకవర్గంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ వి. తెలిపారు. జాబ్ మేళాకు సంబంధించిన గోడపత్రాలను బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ విడుదల చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల విద్యార్హతను బట్టి సుమారు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం లభించే అవకాశముందని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఎంబీఏ, పీజీ విద్యార్హతలు కలిగిన వారికి ఈ జాబ్ మేళా ఉపయోగకరంగా ఉంటుందన్నారు.18 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతీ యువకులు హాజరుకావచ్చని తెలిపారు. అభ్యర్థులు బయోడేటా లేదా రెజ్యూమ్, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులు, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావచ్చన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 7207218883, 9949326722, 9640695229 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఉద్యోగాల కోసం అభ్యర్థులు నైపుణ్యం వెబ్ పోర్టల్‌లో ముందుగా నమోదు చేసుకోవాలని తెలిపారు.కార్యక్రమంలో నైపుణ్య అభివృద్ధి సంస్థ ప్రతినిధి సురేష్, పాల్గొన్నారు.

# పర్యాటక ప్రాంతాల స్వచ్ఛతపై దృష్టి

**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమగ్ర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్.వి ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల్లో హోటళ్లు, రిసార్టులు పరిశుభ్రత, పారిశుద్ధ్య ప్రమాణాలను పాటించేలా స్వచ్ఛత హరిత ఆకుల గుర్తింపు విధానాన్ని సమర్థంగా అమలు చేయాలని సూచించారు.మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో పర్యాటక ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, హరిత ఆకుల గుర్తింపు విధానం అమలుపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. పర్యాటకుల సౌకర్యాలు, ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యమిస్తూ హోటళ్లు, రిసార్టులు నిర్వహించాలని స్పష్టం చేశారు.తాగునీటి నాణ్యత, మరుగుదొడ్ల పరిశుభ్రత, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, వంటశాలల పరిశుభ్రత, ఆహార నాణ్యత వంటి అంశాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. మాంసాహార పదార్థాలను తాజాగా ఉంచడంతో పాటు ఆహార తయారీ ప్రాంతాల్లో పరిశుభ్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా అరికట్టాలని స్పష్టం చేశారు.పర్యాటకుల భద్రత విషయంలోనూ నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. రిసార్టుల్లో ప్రాణరక్షణ కవచాలు, నిఘా కెమెరాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పర్యాటకులకు మెరుగైన సేవలు అందిస్తూ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చే సంస్థలకు వాటి పనితీరు ఆధారంగా ఐదు, మూడు, రెండు, ఒక హరిత ఆకుల గుర్తింపులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

**'బే ఆఫ్ బాపట్ల' వెబ్ సైట్ లో వివరాలు..**జిల్లాలోని హోటళ్లు, రిసార్టుల వివరాలను 'బే ఆఫ్ బాపట్ల' వెబ్‌సైట్‌లో పొందుపరచనున్న ట్లు కలెక్టర్ తెలిపారు. హరిత ఆకుల గుర్తింపు స్థాయి ఆయా సంస్థలు పరిశుభ్రత, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ ప్రమాణాలను ఏ మేరకు పాటిస్తున్నాయో తెలియజేసేలా ఉంటుం దన్నారు.పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కేవలం మౌలిక సదుపాయాలకే పరిమితం కాకుండా



పర్యావరణ పరిరక్షణతో ముడిపడి ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. మండల, గ్రామస్థాయి కమిటీలు క్షేత్రస్థాయిలో పర్యాటక ప్రాంతాలను పరిశీలించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చే పర్యాటకులకు ఆహ్లాదకరమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడం అందరి బాధ్యతగా భావించాలని సూచించారు.సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షణ ఇంజినీర్ అనంతరాజు, పర్యాటక శాఖ అధికారి బెనహర్, గుంటూరు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జ్యోతిబసు, ప్రకాశం జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి బాలమ్మ, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు, హోటళ్లు, రిసార్టుల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.